రాను రాను...

# "భారత ప్రదేష్"

"స్వాప్నికుడు"

చుట్టూ ఎడారిలా ఉంది. గడిచిన పది ఇరవై ఏళ్ళల్లో ఈ ప్రాంతాల ఎవరూ వన మహోత్సవం చేసుకున్న పాపాన పోయినట్టుగాని, అధికాహారోత్పత్తి ప్రణాళిక ఈ ప్రాంతాల అమలు జరిగినట్టుగాని లేదు. లేకపోతే కనుచూపు మేరలో ఒక్క చెట్టుగాని, నాగలి చాలుగాని లేకపోవటం ఎందుకు జరుగుతుందీ?

నాకంతా అయోమయంగా ఉంది. నేనిక్కడికి కెట్లావచ్చాను, ఎందుకొచ్చాను, ఎప్పుడొచ్చాను? నేను చేసుకుంటున్న పని ఏమయింది? నా వాళ్లంతా ఏరీ?

ఆ జడ ప్రకృతి మధ్య ఒక చరప్రాణి కనిపించి ప్రాణం లేచివచ్చింది. చప్పట్లు కొట్టి పిలిచాను. ఆగాడు. దగ్గరికి వెళ్ళి, "ఇదే ప్రదేశం నాయనా?" అన్నాను.

నన్ను ఎగాదిగా చూసి, "భారత్ ప్రదేశ్" అన్నాడు.

"అందులో ఏ ప్రాంతమని?"

"నాకూ తెలీదు."

"ఇదేదో కమ్యూనిస్టులు నాశనంచేసిన ప్రాంతంలా ఉందే-నిర్జనంగా, నిర్జీవంగా-"

"ఇంకా కమ్యూనిస్టు లెక్కడున్నారు? వాళ్లు ఎన్నికలముందే రద్దయిపోయినారు."

"అందర్నీ చంపేశారా ఏం?"

"అదంతా పాత పద్ధతి, కమ్యూనిస్టులంతా పశ్చాత్తాపపడి కాంగ్రెసులో చేరిపోయినారు. ఎన్నికల ముందే అన్ని పార్టీలూ రద్దయినాయి. అందరూ కాంగ్రెసుల్లో చేరారు."

"గుడ్ ఓల్డ్ కాంగ్రెస్", అని ఒక్క క్షణం సంతోషించానో లేదో, మెరుపు సోకినట్టయింది. "ఎన్నికలంటావేమిటి? ఏ ఎన్నికలు?" అన్నా.

"ఇంకే ఎన్నికలు? దేశమంతటా జరిగిన సాధారణ ఎన్నికలు?"

"నేను వోటు చెయ్యకుండానే?"

"నీదో లెక్కా, జమా? నీ తాతల్లాటి వాళ్లు వోటు వెయ్యలేదు. అసలు పోలింగే జరగలా. కాంగ్రెసు అభ్యర్థులంతా పోటీ లేకుండా గెలిచారు."

"మరి పోటీ పక్షాలు?"

"పోటీ పక్షాలు లేందే?"

"అదేమిటయ్యా? ప్రజాపార్టీలూ, రిపబ్లికన్ పార్టీలూ, హిందూ మహాసభా, కిసాన్ పార్టీలూ, ఫార్వర్డు బ్లాకూ—"

"అన్నీ కాంగ్రెసులో చేరాయంటూంటేనే? కాంగ్రెసు ఐక్యతకు అన్నివర్గాలవాళ్లు ఏకమయారు."

"భేష్. ప్రజలో?"

"ప్రజలదేముందీ? ప్రజలుకూడా కాంగ్రెసు పక్షమే."

"కార్మికులు?"

"కార్మికులు ప్రమాణాలు చేశారుగా?"

"ఏమని?"

"కాంగ్రెసు చెప్పినట్టు నడుచుకుంటామనీ, సమ్మెలు చెయ్యమనీ, ఎవరన్నా సమ్మెచేస్తే తుపాకీ వెయ్యమనీ, జీతాలు ఎక్కువ చెయ్యమని అడగమనీ, తిండీ, గుడ్డా, అవసరమైతే ప్రాణాలూ, త్యాగంచేసి అయినా కాంగ్రెసు ప్రభుత్వాన్ని బలపరుస్తామనీ—"

"పత్రికలు?"

"పత్రికలు కాంగ్రెసును విమర్శించమని మాట ఇచ్చాయి. కరువుల్ని గురించీ, ఆకలి చావులను గురించీ వార్తలు వెయ్యమని తీర్మానించాయి."

"వ్యాపారస్తులు విజృంభించి దొంగవర్తకం చెయ్యటంలా?"

"నువ్వెక్కడిదో పాత భాష మాట్లాడు తున్నావు. కంట్రోళ్ళూ అవీ లేవు. ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లు వ్యాపారం చేసుకోవచ్చు."

"కనీసం పన్నులన్నా ఎగేస్తారేక్?"

"ఎగెయ్యనీ! పన్నులు ఎగవేసేవారిమీద చర్యలు మానేశారు. ఎగవేసిన పన్నులను గురించి విచారణ జరపటానికి నియమించిన సంఘంమీద ప్రభుత్వానికి నష్టం వచ్చింది. కార్మికతగాదా పరిష్కార సంఘాలతో బాటు వీటినీ ఎత్తిపారేశారు. పన్ను వసూలుశాఖ కూడా ఎత్తేశారు. ఆదాయాలు గలవాళ్లు తమ ఆదాయాలనూ, దానిమీద పన్నునూ తామే అంచనా కట్టి రెవిన్యూశాఖకు పంపే ఏర్పాటు జరిగింది."

"ఏం, అట్లా చేశారు?"

"పెట్టుబడిదార్లను ప్రోత్సహించటానికి ఇవన్నీ చెయ్యాల్సివచ్చింది."

"దాంతో ఉత్పత్తి సాగిందా?"

"సాగదు మరీ? కూలివాళ్లకు ఇష్టం వచ్చిన జీతాలివ్వచ్చునాయె. ఇష్టం వచ్చిన ధరలకు సరుకు అమ్మవచ్చునాయె."

"ఇంకేం. దేశం బలపడి ఉండాలి."

"అదే బలంలే. అధికోత్పత్తి అయింది. సరుకులు అమ్ముడుపోలే. కూలిడబ్బులు సరుకుల రూపేణా ఇవ్వొచ్చునన్నారు. కూలీలు ఆ సరుకులు అమ్ముకుని గింజలు కొనుక్కోవటానికి నానాపాట్లూ పడుతున్నారు. బజారు ధరకు సగానికి సగం ధరకు అమ్ముడు పోతున్నాయి."

"దొంగమార్కెట్టుకు విరుద్ధంగా ఉందే."

"అందుకనే దానికి దొర మార్కెటని పేరొచ్చింది. దాన్నే తెల్లమార్కెటనీ, కూలీ మార్కెటనీ అంటున్నారు."

"పోనీ, పాపం, కూలీవాళ్లు కూడా ఏదో రూపంగా దొరలనే పేరుసంపాదించుకున్నారు. కానీ పరిశ్రమలు దెబ్బ తినటంలా?"

"తినటంలామరీ. మనదేశ పెట్టుబడిదార్లు కొత్త పరిశ్రమలు పెట్టక పోతేనేగా ఇతర దేశాలనుంచి పెట్టుబడి స్వీకరించి హామీ లిచ్చిందీ?"

"ఆ పరిశ్రమలన్నా సాగుతున్నాయా."

"వాటికేం? యుద్ధ పరిశ్రమలూ, ఆ సంబంధ మైనవీ గా."

"మన పెట్టుబడిదార్లు ఒప్పుకున్నారూ."

"బాగుందే. ఎందు కొప్పుకోరూ? ఈ పరిశ్రమల్లో వాళ్ళకు కొన్ని వాటాలు దొరికాయా? ఈ పరిశ్రమల్లో కూలి చేసుకునే వాళ్లు మామూలు సరుకులు కొనగలిగారు. అందుచేత అంతో ఇంతో ఆ పరిశ్రమలు బాగుపడ్డాయా? ఇంకేం కావాలీ?"

"ఈపనిఎప్పుడో చెయ్యవలసింది, కాదూ?"

"అట్లాగే కనిపిస్తుంది. మరిమనం స్వరాజ్యం స్వాతంత్ర్యం అంటూ కూచున్నా మాయె. అందుచేత అప్పుడే ఈ పని చెయ్యటం జరగలా."

"స్వరాజ్య మంటే జ్ఞాపకం వచ్చింది. రాజ్యాంగ సవరణలు ఏమైనాయి? సవ్యంగా జరిగాయా?"

"ఏ రాజ్యాంగం? అంబేద్కరు స్మృతా?"

"మన కాన్‌స్టిట్యూషన్."

"అర్థమయిందిలే. దాన్ని సంస్కృతంలోకి తర్జుమా చేయించి మ్యూజియంలో పెట్టారుగా. ఇప్పుడు దాన్ని అంబేద్కరుస్మృతి అంటున్నారు. అది అమల్లో లేదు."

"ఏం? అంతడబ్బు ఖర్చుచేసి——"

"దానికంతా చాలా వచ్చిందిలే. ఎన్నికలు దగ్గిర పడుతున్నకొద్దీ చాలా కొత్తచట్టాలు తయారు చేయవలసి వచ్చింది. వాటన్నిటినీ రాజ్యాంగరీత్యా సుప్రీంకోర్టు ఆమోదించాలంటే రాజ్యాంగంలో చాలాకొత్త ఆర్టికిల్సూ, షెడ్యూళ్లూ చేర్చవలసి వచ్చింది. ఇదంతా కుదిరే మేళం కాదని రాజ్యాంగాన్ని బుట్టదాఖలు చేశారు. బ్రిటనునుచూడు, రాజ్యాంగమే లేదు. సర్వహక్కులూ పార్లమెంటువే. మనం ఆ పద్ధతే మొదటినుంచీ అవలంబించవలసివచ్చింది."

"అవుననుకో ——"

"నువ్వేఆలోచించు. మనదేశం అతిశీఘ్రంగా పైకి రావాలంటే ఏమిటి మార్గం? ప్రపంచంలో ఉన్న దేశాలన్నిటినుంచీ మంచి విషయాలు ఎన్నుకుని వాటిని అవలంబించటమేనా, ఇంకేమన్నా ఉందా? మన నాయకులు ఆ పద్ధతే అమలు జరిపారు. బ్రిటనులో లాగ

పార్లమెంటు చేసే శాసనాలకు తిరుగు ఉండక పోవటం; అమెరికాలోలాగ పారిశ్రామిక విషయాలన్నీ పెట్టుబడిదార్లకు వదలటం; జపానులోలాగ కార్మికులకు సాధ్యమైనంత తక్కువ వేతనాలిచ్చి వారిచేత సాధ్యమైనంత ఎక్కువ పని చేయించటం; రష్యాలోలాగ సమ్మెలు అక్రమమని ప్రకటించటం; ఫ్రాన్సులాగ మన పారిశ్రామికాభివృద్ధి మనవల్ల కానప్పుడు, చాతయిన దేశాన్ని ఆహ్వానించటం; చైనాలోలాగ ప్రజలందరూ దేశాభ్యున్నతికోసం కష్టించి పని చేసి తమ సుఖాలు త్యాగం చెయ్యటం – ప్రతి దేశంనుంచీ ఇండియా ఏదో ఒక మంచివిషయం నేర్చుకుంటున్నది. అంబేద్కరు స్మృతి తయారు చేసినప్పుడే ఈ పద్ధతి మనం అవలంబించాం. కాని అది "క్రియారూపం దాల్చ లేదు. ఇతరదేశాల నుండి నేర్చుకోవలిసిన విషయాలు పరిపాలనలో అమలు జరగలా. ఇప్పుడా పొరపాటు సవరణ అయింది."

ఇదంతా వింటూంటే సమంజసంగానే ఉన్నది గాని ఆలోచిస్తే అయోమయంగా ఉన్నది. ఈ మనిషి ఎవరు? వీడు చెప్పే విషయాలన్నీ నాకు తెలియకుండా ఎట్లా జరిగాయి? నేనే మైనాను? రిప్ వాన్ వింకిల్ లాగా నిద్రపోయానా? లేక ఇది పితృదేవతల లోకమా? నాకే తెలియకుండా నేను చచ్చి పోయానా? లేక పరకాయప్రవేశం చేశానా? వీడు నిజంచెబుతున్నాడా? వ్యంగ్యంగామాట్లాతున్నాడా? ఏ తెలంగాణా కమ్యూనిస్టూ కాడుగద? ఇంతసేపూ వీడి మొహం నాకు స్పష్టంగా కనబడదేం? ఈ సందేహాలు ఒకదానినొకటి తరుము కొచ్చాయి.

"నువు చెప్పేది నేను నమ్మలేకుండా ఉన్నాను, తమ్ముడూ. ఎవరినన్నా అడిగి కనుక్కోవాలి. ఇక్కడ ఇంకెవ్వరూ లేరేం? ఎక్కడా ఊరిజాడే లేదేం?" అన్నాను.

"నీకు పుణ్యం ఉంటుంది. ఎవరితోనూ రాజకీయాలు మాట్లాడకు, చిక్కుల్లో పడగలవు. ఎన్నికలలో తమ రాజకీయ హక్కులు వినియోగించుకుని తమ ప్రతినిధులను ఎన్నుకొన్నాక రాజకీయాలను ఆ ప్రతినిధులకే వదలాలని శాసనమున్నది. ప్రజలలో దుష్ప్రచారమూ, అసంతృప్తి చెలరేగుతూండటం, ప్రతివాడూ రాజకీయాలలో జోక్యం కలిగించుకోవటం చేత నేనని మననాయకులు తేల్చారు."

"ఛీ! నువ్వు అబద్ధాలాడుతున్నావు. ఇదంతా కల్పన. నేను నమ్మను. ముందు నీ మొహం సరిగా చూడనీ," అన్నాను.

కాని వాడు నాకు అందలేదు. పరుగెత్తి పారిపోసాగాడు. నేను పరిగెత్తబోయి కుప్పన కూలబడి కాళ్లూ, చేతులూ కదిలించలేక పోయినాను. నేను కూచున్న చోట ఎముకల బూడిద లాగా కనిపించింది. ఏనాడో మా తండ్రిగారి సంచయనం నాటి దృశ్యం మళ్లీ కళ్ళబడింది.

* * *

కళ్లు తెరిచాను. ఫ్యాక్టరీ కూతలు వినిపిస్తున్నాయి. నోటికి రుచిగా ఉందిగదా అని ప్రతి పూటా కొత్త ఆవకాయ తింటే ఏమవుతుంది?

---

ప్రపంచ జనాభా సుమారు 240 కోట్లు అని, 1949-50 సంవత్సరం విషయాలపై మిత్రరాజ్య సమితి ప్రచురించిన 'ఇయర్ బుక్'లో పేర్కొనబడింది. ఆసియాలో 125 కోట్ల మందికి పైగా వున్నారు. అంటే, ఆసియా జనాభా యూరప్ జనాభాకు రెండింతలు.

** ** ** **

ప్రపంచంలో 1950 సంవత్సరానికి బెట్టీ డేవిస్ ఉత్తమ సినిమా నటి అని కేన్స్‌లో (ఫ్రాన్స్) జరిగిన 'చలన చిత్రోత్సవం'లో ప్రకటించబడింది. అమెరికా నాటకరంగంలో జీవితం గురించిన 'ఆల్ ఎబౌట్ ఈవ్' అనే హాస్యరసప్రధానమైన ఫిలింలో ఆమె చూపిన నటనా చాతుర్యానికి పైన తెల్పబడిన బిరుదు ఇవ్వబడింది—("యూసిస్" నుండి.)